# అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టిని పెంచడానికే చేపపిల్లల పంపిణీ
- మహిళలకు సీఎం కేసీఆర్ బతుకమ్మ కానుక
- క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే క్రీడాపరికరాల పంపిణీ
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య, మండల నాయకులు

ధర్మసాగర్, అక్టోబర్ 4 : అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్‌లో సుమారు 12 లక్షల చేప పిల్లలను ఆయన వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టిని పెంపొందించుటకే ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న ముదిరాజ్‌లు నాటి నుంచి వెనుకబడి ఉన్నారని, చేపల వృత్తే జీవనోపాధిగా ఉన్న వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ఉచిత చేప పిల్లలను అందిస్తున్నట్లు తెలిపారు. చేపపిల్లలతో పాటు చేపలు అమ్ముకోవడానికి సబ్సిడీ వాహనాలు అందించారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణాలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించి, వాటిని నీటితో నింపిన ఘనత కూడా సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రూ.20.53లక్షలతో 12.52లక్షల చేప పిల్లలను ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి వదిలినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**బతుకమ్మ చీరెల పంపిణీ**

రాష్ట్రంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సీఎం కేసీఆర్ మహిళలకు కానుకగా చీరెలు అందిస్తున్నారని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ధర్మసాగర్, వేలేరు మండలాల చెందిన మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. అనంతరం క్రీడా మంత్రిత్వశాఖ ద్వారా మంజూరైన క్రీడా పరికరాలను ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన యువకులకు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల సీఎం కేసీఆర్ కప్ పేరిట 18 రకాల క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించాలనే అనేక గ్రామాల్లో క్రీడా ప్రాంగాణాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవితారెడ్డి, జడ్పీటీసీ పిట్టల శ్రీలత, వైస్‌ఎంపీపీలు బండారి రవీందర్, ఆంగోత్ సంపత్, కోఆప్షన్ సభ్యురాలు జుబేదాలాల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మునిగెల రాజు, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ పిట్టల సత్యనారాయణ, ఎంపీటీసీలు రొండి రాజు, ఎంపీడీవోలు జవహర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, ఎంపీవో విమల, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తలకు కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరిన వంగపల్లి బీజేపీ నాయకులు

కమలాపూర్, అక్టోబర్ 4 : మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు గ్రామ శాఖ అధ్యక్షుడు నకిర్త రాజు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి వారు బీఆర్ఎస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కొలిపాక రాకేశ్, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పింగిళి ఇంద్రారెడ్డితోపాటు 20మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారికి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎంపీటీసీ రామస్వామి, నాయకులు పొడేటి సారయ్య, కొలిపాక సాంబయ్య, పెరటి రమేశ్ రెడ్డి, కొలిపాక సురేశ్ పాల్గొన్నారు.

## కేయూ న్యాయశాస్త్ర విభాగాల డీన్‌గా శ్రీనివాస్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగాల డీన్‌గా ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి నుంచి ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించనున్నారు. శ్రీనివాస్ 2008లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కేయూలో ప్రవేశించారు. ఇప్పటివరకు ఆయన కేయూ వసతి గృహ సంయుక్త సంచాలకులుగా, న్యాయ కళాశాల విభాగాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా, పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా, ప్రవేశాల డైరెక్టరేట్ సంయుక్త సంచాలకులుగా పనిచేశారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ ఆర్‌టీఐ, లీగల్ సెల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాజీపేట, అక్టోబర్ 4 : విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు సూచించారు. కాజీపేట పరిధిలోని పలు పాఠశాలలో స్థానిక ట్రాఫిక్ సీఐ కే సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసీపీ భోజరాజు మాట్లాడుతూ పిల్లలు ఎట్టి పరిస్థితిలో వాహనాలను నడుపవద్దన్నారు. ఒక వేళ నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైదర్ ప్రతాప్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రామారావు, ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్ఏ-1 పరీక్షల్లో స్వల్ప మార్పులు

హనుమకొండ సిటీ, అక్టోబర్ 4 : ఒకటి నుంచి 10వ తరగతి వరకు గురువారం నుంచి నిర్వహించనున్న ఎస్ఏ-1 పరీక్షల సమయాల్లో స్వల్ప మార్పులు చేశామని, దానికనుగుణంగా అన్ని యాజమాన్యాల హెచ్ఎంలు పరీక్షలు నిర్వహించాలని డీఈవో, ఉమ్మడి పరీక్షల బోర్డు చైర్మన్ డాక్టర్ అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, 6, 8వ తరగతికి ఉదయం 10 నుంచి 12.45 వరకు, 7వ తరగతికి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.45 వరకు, 9వ తరగతికి మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 30, 31న జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. నవంబర్ 1న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థుల పురోగతిపై మాట్లాడి ప్రోగ్రెస్ కార్డులను అందజేయాలని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సందేహాలు ఉన్న జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి లేదా సహాయ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

## 11న దేశవ్యాప్త ఆందోళన

నయీంనగర్, అక్టోబర్ 4 : గ్రామీణ ఉపాధి హామీ చట్టాని కాపాడుకుందామనే నినాదంతో ఈ నెల 11న దేశ వ్యాప్తంగా నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. హనుమకొండలో సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఢిల్లీలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి పనిని తీసివేయాలని అనేక చర్యలను చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వేతనాలు చెల్లింపును ఆన్‌లైన్ పేమెంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటున్నదని. సమావేశంలో జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, అంబాల స్వరూప, చిలకా రాఘవులు, వేలు రజిత, పద్మ, భాగ్య, లత పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయానికి ఐటీ నోటీసులు

- ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలని ఉత్తర్వులు
- బిత్తరపోతున్న దేవాదాయ శాఖ అధికారులు

వరంగల్, సెప్టెంబర్ 4 : భద్రకాళీ ఆలయానికి ఐటీ శాఖ నోటీసులు జారీ చేసింది. భక్తులు ఇచ్చిన విరాళాల సొమ్ముతో చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ ఐటీ అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా దేవాలయాలకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడంపై దేవాదాయ శాఖ అధికారులు బిత్తరపోతున్నారు. ఉమ్మడి ఇల్లా వ్యాప్తంగా అనేక దేవాలయాలకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే, దేవాదాయ శాఖ అధికారులు మాత్రం ఐటీ శాఖ నోటీసులపై వివరణ ఇచ్చేందుకు ఆడిటర్లను సంప్రదిస్తున్నారు. 2016 నుంచి దేవాలయ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలని ఐటీ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. భక్తులు ఇచ్చే విరాళాలతో అభివృద్ధి చెందుతున్న దేవాలయాలకు ఇన్‌కం ట్యాక్స్ చెల్లించాలంటూ ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం విడ్డూరంగా ఉందని దేవాదాయ శాఖ అధికారులు అంటున్నారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు దేవాలయాలకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. భద్రకాళీ దేవాలయంలో పాటు మరి కొన్ని ప్రసిద్ధ దేవాలయాలకు నోటీసులు అందినట్లు దేవాదాయశాఖ వర్గాల ద్వారా తెలిసింది. దీనితో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలు ఐటీ శాఖ అందుకున్నట్లు సమాచారం. నోటీసులు అందుకున్న దేవాలయాల అధికారులు ఏం చేయాలన్న దానిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లినట్లు తెలిసింది. ఆలయాలకు ట్యాక్స్ చెల్లించాలంటూ నోటీసులు జారీ చేయడం ఎప్పుడు లేదని అధికారులు అంటున్నారు.



## రిటైర్డ్ ప్రొఫెసర్ రామస్వామికి ఫెలోషిప్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4: కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య ఎన్ రామస్వామి యూనైటెడ్ కింగ్‌డంలోని ప్రతిష్ఠాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ వారి ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. రామస్వామి జీవశాస్త్రంలో చేసిన అత్యుత్తమ పరిశోధనలకుగాను ఎంపిక చేశారు. గతంలో రామస్వామి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుడిగా కూడా అవార్డు పొందారు. పరిశోధనల నిమిత్తం అమెరికా, నెదర్లాండ్, బ్రెజిల్, శ్రీలంక దేశాలను సందర్శించారు. ఈ మేరకు ఆయనను వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

# జర్నలిస్టులు అస్థిత్వాన్ని కాపాడుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా కృష్ణకుమార్

న్యూశాయంపేట, అక్టోబర్ 4 : మీడియా రంగంలో ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఉనికి కష్టతరంగా మారిందని, ఈ తరుణంలో జర్నలిస్టులు ఐక్యంగా అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొల్లా కృష్ణ కుమార్ పిలుపునిచ్చారు. హంటర్‌రోడ్డులో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం వేదికగా తెలంగాణ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ కమిటీ సన్నాహక సమావేశాన్ని కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పడుతున్న ప్రింట్ మీడియా అసోసియేషన్ రాష్ట్రంలో ఉన్న ఏ యూనియన్‌కి వ్యతిరేకం కాదన్నారు. ఇతర సంఘానికి అనుబంధం కూడా కాదని తెలిపారు. త్వరలో సభ్యత్వ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని అన్ని జిల్లాల్లో సంఘాన్ని విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అడహక్ కమిటీ కోకన్వీనర్లు కంకణాల సంతోష్, కట్కూరి రవికుమార్, ఊటుకూరు సాయిరాం, బొమ్మగాని ఆదర్శ్, అల్వాల సదాశివుడు, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్‌లో జిల్లా వాసులు**

నయీంనగర్ : తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో హనుమకొండ జిల్లా నుంచి కోశాధికారిగా వుప్పు రాజేందర్, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, వెన్నె రవి, ఎండీ రఫీక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు వారు రాష్ట్ర అధ్యక్షుడు సత్యం, రాంప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఆంజనేయగౌడ్

## క్రీడాకారులకు సాట్ చైర్మన్ అభినందన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ అభినందించారు. బుధవారం హనుమకొండకు వచ్చిన ఆయన ఇటీవల జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించిన హనుమకొండ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వృద్ధుడి మృతి

డోర్నకల్, అక్టోబర్ 4 : మనస్తాపంతో వ్యక్తి మృతి చెందిన ఘటన రావిగూడెంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... రావిగూడెం గ్రామానికి చెందిన అత్తూలూరి వెంకయ్య(73) తన భూమిలో సొసైటీ సభ్యులు చేపల చెరువు పెట్టారని మనస్తాపానికి గురై మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ ఏరియా దవాఖాన లో పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.